## విద్యార్థినుల కథా రచనల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# సబల

ఎమ్. శ్యామల

పడమటి కన్య ఎర్రచీర కట్టుకొని చంద్రుని ఆహ్వానించటానికి సిద్ధంగా వుంది. పగలంతా ఎండలు కక్కిన భానుడు సంధ్య వడిలోకి ఒదిగి పోయాడు. కిరణ్ మొహంపై తారాడుతున్న ముంగురులు చంద్రునిపై ముసురుకుంటున్న మబ్బుతునకల్లాగున్నాయి. నిజంగా ఆడవాళ్ళు కోపంలో కూడ ఇంత అందంగా వుంటారా?.... అని కిరణ్ వంక దీక్షగా చూస్తూన్న నేను కిరణ్ మాటలకు ఉలిక్కిపడ్డాను.

"ఏం టట్లా కొత్తవాళ్ళని చూస్తున్నట్లు గుచ్చి గుచ్చి చూస్తున్నారు? నే చెప్పిన విషయం ఆలో చిస్తున్నారా?" "ఆ....ఆ....అదే ఆలోచిస్తున్నా." "ఆ....మాబాగా ఆలోచిస్తున్నారు. అన్నీ అబద్ధాలు. ఇప్పుడు మీరు ఆలోచిస్తూంది నాగురించి కాని, మన సమస్య గురించి కాదని తెలుస్తునే వుంది. మీ కంతగా పట్టనప్పుడు నా కెందుకింత బాధ? – నా బుద్ధి తక్కువ గాని!" సుతారంగా అలిగింది. ఇప్పుడింకో అందం. చూపు మరల్చ లేకుండా ఉన్నాను. చిన్ననోరుని సున్నాలా ముడి చింది. కనుబొమ్మలు అందంగా ముడి పడ్డాయి....

ఇలా చూస్తుంటే నా నిగ్రహం సడలడం తథ్యం. అని అనుకొని బలవంతాన ప్రక్కన పిల్లలు బొమ్మరిళ్ళు ఆటలాడుకుంటుంటే అటువైపు చూడ్డం మొదలెట్టా. "సుధీర్ నేవెళుతున్నా." అని హటాత్తుగా లేచింది కిరణ్. ఒక్కసారి అదిరిపడ్డా. వెంటనే చేయిపట్టి కూర్చోపెడ్తూ "నీవు ఎదురుగా వుంటే ఏం ఆలోచించలేను కిరణ్. ప్లీజ్. కూర్చో. నువు ఏదైన మాటల్లో దింపితే కాని నాకు మూడ్ కుదరదు" అన్నాను.

"కిరణ్ నిన్నొదిలి నిజంగా నేను వుండగలనా? అనిపిస్తుంది." అని ఇంకా ఏమో అంటుంటే మాట మధ్యలోనే కయ్యిమంటూ లేచింది. 'ఆహా! ఇలాంటి సినిమా డైలాగులు చెప్పడాని



కేంలే! నన్నొదలమన్నానా? ధైర్యం నీకు లేదు కాని – నాది అంతా ఆవేశమంటావు. ఒక సంవత్సరం నుండి ఆలోచించి నేనే నిర్ణయానికొచ్చాను. ఎంతైనా తనంతట తాను కోరి వచ్చిన ఆడదంటే మీ మగజాతికి చులకనేగా! పదినిమిషాల్లో చెప్పు అంగీకరించినట్టేనా?

"ఒకవేళ నేను కాదంటే?"

"అందుకు సిద్ధంగానే వున్నాను. నేనేం భగ్న ప్రేమికురాలిలాగ వుండిపోను. జీవితంలో ప్రేమ ముఖ్యం కాదు. అది ఒక భాగం మాత్రమే. ఎప్పుడయితే నువు కాదంటావో అది నా జీవితానికి ఒక సవాలే అనుకుంటా. డబ్బు లేదనేగా నన్ను కాదనడం. నేను సవాల్ ఎదొర్కొని ఒక సామాన్యుడ్ని పెళ్ళి చేసుకొని మీ అంతస్తుకు ఎగబ్రాకి మీ కూతుర్ని నా కోడలిగా చేసుకుంటాను. తెల్సా? అని కోపంగా అంది కిరణ్.

"మైగాడ్ చాలా పెద్ద ప్లానే. ఎందుకంతగా అప్‌సెట్ అవుతావు గాని రేపు ఇదే టైముకి ఇక్కడ కలుసుకుందాం." "మీరంతా ఇంతే. ముందంతా ప్రేమించేస్తారు. అదో ఫాషనయినట్టు. పెళ్ళి మాటంటే ఆలోచిద్దాం అంటారు."

"సరే, రారా బాగా చీకటయింది" అంటూ నేను లేచి క్రిందనుండి కర్చీఫ్ తీసుకొని బయటికి నడిచా. "ఇవాళ్టికి నేను డ్రాప్ చేస్తాను రాకూడదూ?" అని భయపడుతూనే అడిగా. "ఏం నేనిట్లా వుండటం ఇష్టం లేదా? అంతగా నేను మీతో రావాలనుకుంటే రేపటి మీ నిర్ణయం అనుకూలంగా ఉండేటట్టుగా ప్రయత్నించండి. బైబై" అని చేయి ఊపి బస్‌స్టాండ్ వైపు మళ్ళింది. నేను చేసేదిలేక స్కూటర్ స్టార్ట్ చేశాను.

*

ఇంట్లో అడుగుపెట్టిన నాకు–తెలియకుండానే ఎందుకో ఇదే ఆఖరిసారేమో—ఈ ఇంట్లో నా నివాసం. అని ఒక విధమైన పిరికితనం, నిస్సహాయత్వం ఆవరించినట్లయింది. కాని కిరణ్ మాటలు, ఆమె నిర్ణయం గుర్తుకొచ్చే సరికి మత్తు వదిలినట్లనిపించింది.

భోజనం సరిగా చేయలేకపోయా. "ఏమిటో మరిదిగారికి ఆలోచనలెక్కువయి పోయాయి. ఒంటరితనం భరింపరానిదిగా ఉందా?" అని వదిన ఎగతాళి చేసినా ఎప్పటిలా ఎదురు జవాబివ్వక చిన్నగా నవ్వి నా రూంలోకొచ్చేసా. అన్నం సరిగ్గా తినలేదనేమో–వదిన పాలు, ఆపిల్ ముక్కలు రాములుచేత గదికి పంపించింది.

ఏం తోచడంలేదు. మెల్లగా టేప్‌రికార్డర్ ఆన్ చేసా. పాశ్చాత్య సంగీతం మంద్ర స్థాయిలో వినిపిస్తూంది.

ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. ఫాన్ ఆన్‌చేసి దిండు కానుకొని వెనక్కి జారగిలబడి పడుకున్నా. కిరణ్‌తో నా పరిచయం కళ్ళ ముందు కదిలింది...

అప్పట్లో నా ఫ్రెండ్స్ అంతా ఆమెకి చాలా గర్వమని అనే వాళ్ళు. కాని నాకామెలో ఏదో ఆకర్షణ కనిపించేది. ఎప్పుడు చాలా ముభావంగా ఉంటుంది. మాటల్లో పడితే మాత్రం సర్వం మరిచిపోతుంది. ఆమె నవ్వు ఎంత అందంగా ఉంటుందని! కొత్తలో నాతో 'టీసింగ్' ధోరణిలో మాట్లాడినా రాను రాను పరిచయం ఎక్కువయిన కొద్దీ ఆమె ఇతరులకి ఎంత సన్నిహితంగా వుంటుందో గ్రహించా. ఏదైనా నిర్మొహమాటంగా అనేస్తుంది. ఎదుటివాళ్ల ఏమనుకుంటారన్న ధ్యాసే ఉండదు.



ఎమ్. శ్యామల

ఈ క[illegible] సబల) రాసిన ఎమ్. శ్యామల హైద్రాబాదు ఆంధ్ర మహిళాసభ నిర్వహిస్తున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బి. ఎ. చదువుతున్నారు. నాలుగు సంవత్సరాలుగా కథలు రాస్తున్నారు. కొన్ని కథలకు బహుమతులు కూడా వచ్చాయి. పై చదువులు చదువుకుని, విద్యారంగంలో పేరు సంపాయించాలని అభిలషిస్తున్నారు. అలాగే, రచయిత్రిగా కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నారు.

కాని ఆమె అన్నందుకైనా ఎదుటివాళ్ళు తన ప్రవర్తనని మార్చుకొని తీరుతారు. తనకు మంచి అని తోచిన పనికి ఎటువంటి అడ్డు వచ్చినా మానదు. తను అందర్నీ అర్థం చేసుకుంటుంది కాని తను ఎదుటి వారికి అర్థం కాదు. నా ఫ్రెండ్సంతా అన్నట్టు నిజంగానే నా డబ్బు చూసే నన్ను ప్రేమిస్తూందని నేనూ అనుకున్నా. వాళ్ళంతా అన్నారు కూడా. వాళ్ళ ఈర్ష్యకి నాకు నవ్వొచ్చింది. కాని కిరణ్ అభిప్రాయం తెలుసుకోవడం ఎలాగో నాకర్థం కాలేదు.

ఆరోజు కలవగానే హోటల్‌కి తీసుకెళ్ళింది. దారిలో ఒక్కమాట మాట్లాడలేదు. కాఫీకి ఆర్డరిచ్చి నావైపు చూడ్డం మొదలెట్టింది. నేనలా చూస్తే వెక్కిరించేది. తనట్లా చూస్తుంటే నాకెంతో ఇబ్బందిగా అనిపించి చూపు మరల్చా.

"సుధీర్...." అని ఆగింది.

ఏంటన్నట్లు కిరణ్ కళ్ళల్లోకి చూశా.

"సుధీర్! మీకు నాపై ఎలాంటి అభిప్రాయం వుంది?"

"ఏంటట్లా అడుగుతున్నావు? నిన్నెప్పుడూ నేను అపార్థం చేసుకోలేదే." "కాదు నాకు సూటిగా సమాధానం చెప్పండి. నేనివ్వాళో కొత్త విషయం విన్నాను. నేను....నేను మీ డబ్బు చూసి మీతో స్నేహం చేశానట!" అని కళ్ళు వాల్చింది. కిరణ్ కళ్ళలోనికి చూసేసరికి నాకు నిజంగా చాలా జాలేసింది. ఎంత సున్నితమైన మనసు అనుకున్నాను. నేను ఏమీ చెప్పకపోవడంతో తలెత్తి నావైపు చూసింది. నీళ్ళతో నిండిన ఆ పెద్ద పెద్ద కళ్ళని చూచేసరికి నిజంగా నాకు మతిపోయింది. ఆమెను ఆ స్థితిలో నేనెప్పుడూ చూడలేదు. "ఎవరో ఏదో అంటే బాధపడ్డమెందుకు? మనలో ఏం కాలుష్యం లేనప్పుడు" అన్నాను. "కాదు. ఎందుకు మనుషుల్ని అనవసరంగా దుయ్యపడ్తారు–వాళ్ళ మనస్సేంటో తెలుసుకోక? మీరు మాత్రం చెప్పడంలేదు. కాని నేనివ్వాళ స్పష్టంగ చెప్తున్నాను. మీ డబ్బుతో నాకేం పని

లేదు. ఆ డబ్బు అన్నది మీ వెనకాల లేకపోతే మీతో నేనింకా ఫ్రీగా వుండేదాన్నేమో. కాని మీలో ఏదో....ఎలా చెప్పాలి. ఏదో ఆకర్షణ వుంది. దానికి లొంగిపోతూ మీ అమాయకత్వం చూస్తే ఎందుకో ఏడిపించ బుద్ధేసేది. అలా అలా మీతో పరిచయం ఏర్పడింది. అంతేకాని మీ డబ్బు చూసి కాదు.'' అని గడగడ చెప్పి కళ్ళు తుడుచుకుంది. నాకెంతో ఆనందమనిపించింది ఆ క్షణంలో. నా అంత అదృష్టవంతులు ఎవరూ లేరనుకున్నా.

"మీలో వున్న పిరికితనాన్ని అమాయకత్వాన్ని పోగొట్టి మీ వ్యక్తిత్వాన్ని నిలబెట్టాలని అనుకున్నా. కాని అమాయకంగా కనిపించే మీరు అసాధ్యులు'' అని, ఒక కప్పు నావైపు జరిపి "తీసుకోండి'' అని అంది. కాఫీ సిప్ చేస్తూ మధ్యలో "నా మీద నాకు నమ్మకం, విశ్వాసం, తప్పు చేయడం లేదనే భావం వున్నంతవరకు ఎవరికీ భయపడే అవసరం నాకు లేదు. ఎవరో ఏదో అన్నారని నా ప్రవర్తనను మార్చుకోను'' అని నెమ్మదిగా గొణుక్కున్నట్టుగా అంది. "మరి ఇంకెందుకు అంత బాధపడిపోయావు. కన్నీళ్ళు కూడా వచ్చాయి'' అని తమాషాగా అన్నా.

నావైపు చురుక్కున చూస్తూ "మీరు ఆడపిల్లలయితే తెల్సేది" అని కోపంగా అంది. ఆమె కోపంగా వుంటే ముద్దొస్తుంది. చిన్నపిల్లలు మారాం చేసినట్లుగా వుంటుంది.

నాన్నగారి ఆశలకి అంతంటూ లేకుండా పోయింది. ఇంతవున్నా కూడా ఇంకా ఆశించడమే. నిజమే! కిరణ్ అన్నట్లు నాన్నకి ఓ ఆడపిల్ల వుంటే తెల్సేది బాధ! మరీ అంత నిర్మోహమాటంగా 50 వేలు కట్నం ఇస్తేగాని చేసుకోనంటాడా! ఛీ ఛీ నేను 50 వేలకి అమ్ముడుపోవాలా? అలా అయితే నా భార్య దగ్గర నాకేం స్వేచ్ఛవుంటుంది? ఒక విధంగా అమ్ముడుపోయిన నేను–భర్తగా ఆమెని ఎలా ట్రీట్ చేయాలి?

'బాగుంది. మీనాన్నకి 50 వేలు కావాలి. మీకు నేను కావాలి. ఇదిగో ఇప్పుడే చెప్తున్నా. మేము ఆ వేలు, లక్షలు ఇవ్వలేము. కాబట్టి మీరు అవ్వాయి వెనుక తువ్వాయి అయితే నామీద ఆశలు వదులుకొని ఆ లక్షలు తెచ్చే లక్ష్మినే వరించండి. లేదా నేను కావాలనుకుంటే నేను చెప్పినట్లు చెయ్యండి. నాకేం కార్లు, మేడలు, ఐశ్వర్యంమీద ఆశలేదు. ఎలాగూ నేను చదివా. మీరు చదువు పూర్తి చేసుకొని ఉద్యోగాన్వేషణలో వున్నారు. మీకు ఉద్యోగం దొరక్కపోదు. నాకు నిన్ననే ఉద్యోగానికి ఆర్డర్స్ వచ్చినాయి. మీకు ఉద్యోగం దొరికేవరకు ఎలాగో సరిపెట్టుకోవచ్చు. ఇద్దరం ఎవరి మీదా ఆధారపడవలసిన అవసరం లేదు. డబ్బే జీవిత లక్ష్యం కాదని మీవాళ్ళకి ఋజువు చేస్తా. నేను మీరనుకున్నంత నీచురాలిని కాదు–ఆస్తిమాసి ఎరవేయడానికి! మీకిష్టమయితే మీ సర్టిఫికెట్స్ అన్నీ తీసుకొని వచ్చేసేయండి''.

"ఆ అలాగే'' అని లేచి కూర్చున్నాను. "ఏంటండి–'అలాగే' అంటున్నారు. నేనిప్పుడేం మీకు పని చెప్పలేదే!'' అని గదిలోకి వస్తూ వదిన అడిగింది. నా పరధ్యానానికి నాకే చికాకేసింది. కిరణ్ అన్న మాటలు తలుచుకుంటుంటే ఆమె ఎదురుగా వుండి అంటున్నట్లుగా అనిపించింది.

"మీరు కిరణ్ గురించి ఆలోచిస్తున్నారు అనుకుంటా. కిరణ్ స్వభావం నాకు తెలుసు. చాలా మంచిది. నేనంటే లక్షాధికారి బిడ్డని కాబట్టి మీ అన్నయ్యని కొనగల్గా. కాని కిరణ్ మిమ్మల్ని కొనలేదు. నాకు ఎందుకో ఆమె ప్రేమే జయిస్తుందనిపిస్తుంది. ఇవాళ కలిసిందా?'' అని వదిన అడిగిన ప్రశ్నకి హతాశుడనైపోయాను. వదినపై నాకున్న అభిమానం, తన దగ్గర వున్న చనువుతో "వదినా! మీకన్నీ తెలిసిన తరువాత దాచడం ఎందుకూ?'' అని అన్నీ చెప్పా. అంతా విన్నాక మీ అభిప్రాయం ఏంటని నన్ను అడిగారు. నేను వెంటనే ఏం చెప్పలేకపోయా. వదినే మళ్ళీ అన్నారు, "నా పెళ్ళిలోనే కిరణ్‌ని చూసి అనుకున్నా, ఈమె నా తోడికోడలయితే మామయ్యని మార్చగలదని. ఎలాగూ నేను వాళ్ళ బంగారు బొమ్మని. ఒక ఆడపిల్ల తనే ఒక నిర్ణయానికి రాగలిగినప్పుడు పురుషుడవైయుండి ఇంత ఆలోచన ఏమిటి? మీ కాళ్ళ మీద మీరు నిలబడడానికి మీకు విద్య వుంది. ఇంకా ఆలోచన ఎందుకు?'' అని సవాల్ చేసింది. వదిన మాటలకి నాకు కొంచెం రోషం వచ్చింది. నేనేనా చేతకానివాణ్ణి– అనుకున్నా. కిరణ్‌కి ఫోన్ చేయడానికి వెంటనే లేచా.

"ఆగండి. ఇవి ఫోనులో చెప్పే విషయాలు కావు. ఆమెని కలుసుకున్నప్పుడే చెప్పొచ్చు. విష్ యు ఆల్ ది బెస్ట్! మీరు సరియైన మార్గంలో పోతున్నారని నా అభిప్రాయం. కిరణ్‌ని అడిగానని చెప్పండి.'' అని వదిన తన గదిలోకి వెళ్ళిపోయింది. అన్నయ్య ఇంకా డిస్పెన్సరీ నుంచి రానట్టుంది.

*

కిరణ్ లేచిపోయిందన్నారు! తండ్రీ, కొడుకుల్ని వేరుచేసిందన్నారు! బరితెగించిందన్నారు! ఇంకా....ఇంకా ఎన్నో అంది ఈ సంఘం, ఈ సమాజం. ఓపక్క 'వరకట్నం తీసుకోవటం దురాచారం, దాన్ని అరికట్టండి' అని గోలపెట్టిన ఈ సంఘమే కిరణ్ ఓమంచి పని చేస్తే వేలెత్తి చూపింది. 'బరి తెగించిన ఆడది' అంది. ఎక్కడుంది న్యాయం? సంఘానికి నోరేగాని కళ్ళు లేవా? అరుస్తుందే గాని మార్పు చూసి సహించ లేదా? □

## నీ కోసం

పాడాలనివుంది నీ కోసం ఒక గీతం
కాని........
గీతానికి అందని సంగీతానివి నీవు!

గీయాలని వుంది నీ మృదు సుందర చిత్రం
కాని........
చిత్రానికి అందని విచిత్రానివి నీవు!

రాయాలని వుంది నీపై రమ్యమైన ఒక కావ్యం
కాని........
కావ్యానికి అందని నీ చరిత్ర నవ్యాతి నవ్యం!

నా ఊహల కందని నీవు దేవతవా?
కాదు........కాదు........
అందరికీ లభ్యం కాని మమతవు!
ఎవరికీ అర్థం కాని వనితవు!

—ద్రోణంరాజు
సీతామహాలక్ష్మి